


ఐటిడిఎ పిఒగా సబ్‌కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - పాలకొండ

పాల కొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగదీష్ సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా శుక్రవారం ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ డిఇ నాగభూషణం, సూపరింటెండెంట్ అప్పారావు, పిహెచ్ఒ వెంకట గణేష్, ఎఒ సునీల్ మర్యాదపూర్వకంగా కలిశారు.



పిఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

బడిదేవర కొండపై రూటు మార్చిన ఎమ్మెల్యే

- మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ డిమాండ్ వెనుక ఆంతర్యమేమిటో?
- పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బడిదేవర కొండ మైనింగ్‌పై రూటు మార్చారు. నిన్నటి వరకు కొండపై మైనింగ్ తవ్వకాలకు మద్దతు పలికిన ఆయన ఇప్పుడు అకస్మాత్తుగా రూటు మార్చడం చర్చనీయాంశమవుతోంది. మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని కోరీ రెవెన్యూ పరిధిలో ఉన్న బడిదేవరకొండపై గత ఏడాదిన్నర కాలంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయి. అన్ని రకాల అనుమతులతో కంపెనీ యాజమాన్యం తవ్వకాలు ప్రారంభించింది. ఇక్కడ నుంచి గ్రానైట్ రాయిని కూడా లారీల్లో ఎగుమతి చేస్తున్నారు. అయితే ఉన్నపలంగా ఎమ్మెల్యేకి బడిదేవర కొండపై ఎందుకు దృష్టి మళ్లిందనేది చర్చ జరుగుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. గడచిన ఏడాది కాలంలో బడిదేవర కొండ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన కమ్యూనిస్టు పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు, గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపట్టాయి. బడిదేవర కొండపై తవ్వకాలు చేయడం వల్ల చుట్టూ ఉన్న చెరువులకు నీరు చేరదని, పంట పొలాలు నాశనమవుతాయని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఉద్యమాన్ని నడిపించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే జోగారావుతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతులు అందజేశారు. అప్పుడు నోరు మెదపని ఎమ్మెల్యే బోనెల గురువారం అకస్మాత్తుగా తన అనుచరులను వెంటబెట్టుకొని కొంతమంది స్థానిక గిరిజనులతో కలిసి బడిదేవరకొండపైకి వెళ్లి పనులు ఆపేయాలని ఆదేశించారు. ఇకపై తవ్వకాలు చేయొద్దని, మరోసారి చుట్టుపక్కల గ్రామాల ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తర్వాత పనులు చేపట్టాలని హుకుం జారీ చేశారు. దాదాపు ఏడాదిన్నర కాలంగా మౌనం వహించిన అధికారపార్టీ ఎమ్మెల్యే బోనెల అనూహ్య రీతిలో కొండపైకి వెళ్లి జులుం చేయడం సరికొత్త చర్చకు దారితీసింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజల ప్రయోజనాలే తనకు ముఖ్యమన్న రీతిలో ఆయన మాట్లాడడం పలు అనుమానాలకు తావిస్తోంది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు గుర్తుకు రాని ప్రజాప్రయోజనాలు ఇప్పుడు గుర్తుకు రావడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ మొదలైంది. నిజంగా ఆయనకు ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని భావించి ఉంటే బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలు జరిగేవి కాదు. ఈ కొండ చుట్టూ సుమారు పది గిరిజన గ్రామాలు వున్నాయి. కొండను బడిదేవర తల్లిగా ఆరాధిస్తూ సమీప గ్రామాల ప్రజలు ఏటా పూజలు చేస్తుంటారు. కొండపై పడిన వర్షపు నీరు సమీప గ్రామాల చెరువుల్లోకి చేరి నిండుతాయి. తద్వారా ఆ నీటితో రైతులు రకరకాల పంటలు సాగు చేస్తున్నారు. అన్నిటి కన్నా మించి బడిదేవర కొండ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో వుందని గతంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల సర్వేలో నిర్ధారించారు. చుట్టూ రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో సుమారు 150మంది గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు కూడా ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ పట్టాలు పొందిన గిరిజన రైతులు, సమీప గ్రామాల ప్రజలు బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలు చేయొద్దని డిమాండ్ చేశారు. అయినా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొండపై మైనింగ్ తవ్వకాలు మొదలయ్యాయి. ఒకవైపు బడిదేవరకొండ పరిరక్షణ సమితి ఆధ్వర్యాన గిరిజనులు, గ్రామస్తులు పోరాడినా స్పందించని ఎమ్మెల్యేకు ఇప్పుడు అకస్మాత్తుగా ప్రజలపై ప్రేమాభిమానాలు పుట్టుకుని రావడంపై ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత గడిచిన ఏడాదిన్నర కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేసిన దాఖలాలు లేవు. పట్టణంలో ప్రభుత్వ చెరువులు, భూముల కబ్జాదారుల అంతు చూస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇంతవరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పట్టణంలో భూకబ్జాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా ప్రజల క్షేమం కోసం బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలు ఆపాలన్న మాటపై ఎంతవరకు నిలబడతారో వేచి చూడాల్సిందే.



గ్రానైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర (ఫైల్)

అనర్హత పేరుతో పింఛన్ల తొలగింపు

ప్రజాశక్తి -కురుపాం

నడవలేని స్థితిల్లో ఏ పనీ చేసుకోలేక ప్రభుత్వం ఇచ్చే పింఛనుతో జీవనం సాగిస్తున్న వికలాంగులపై ప్రభుత్వం కక్షగట్టింది. అంగవైకల్యంతో ఇబ్బందులుపడుతున్న వికలాంగుల పింఛన్ భరోసాపై దెబ్బకొట్టింది. గత వారం రోజులుగా అనర్హుల పేరుతో అధికారులు వారికి తాఖీదులు ఇస్తున్నారు. ఇవి అందుకున్న వికలాంగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వైకల్యంతో సాధారణ మనుషుల్లా జీవించలేని వారి కోసమంటూ ప్రభుత్వమిస్తున్న సహాయంతో ఎంతోకొంత భరోసా, ఇళ్లలో ఆదరణ ఉంటోంది. ప్రభుత్వం ఒక్కసారిగా అనర్హులంటూ ఇచ్చిన తాఖీదులతో వారిలో గుబులు మొదలైంది. పుట్టుకతోనే కాళ్లు లేకుండా నడవడం కూడా ఇబ్బందికరంగానున్న తాము ఏ రకంగా అనర్హులమయ్యామో తెలియక అయోమయంలో పడ్డారు. వచ్చే నెల నుంచి పింఛను అందదేమోనన్న భయంతో కార్యాలయల వద్దకు పరుగులు తీస్తున్నరు.

ఎవరిని కదిలించినా కన్నీటి పర్యంతమే

మండలంలో కురుపాం మేజర్ పంచాయతీలో 30 పెన్షన్లు, నీలకంఠాపురంలో 12, పి.లేవిడిలో 7, టొంపపలపాడులో 6, గుమ్మలో 5, కిచ్చాడ 5, వబ్బంగి 5, బియ్యాలవలస లో 3, మొండెంఖల్‌లో 6, జి.శివడలో 3, గుజ్జువాయిలో 3, జరడలో 2, ఉదయపురంలో 4, రస్తాకుంటుబాయిలో 3, ఉసకొండ, మరిపల్లి, పెద్దగొత్తిలిలో ఒక్కొక్క పింఛను చొప్పున మండలంలో 96 మంది పెన్షన్‌దారులకు నోటీసులు అధికారులు అందజేశారు. అయితే వికలాంగత్వం 40శాతం కంటే తక్కువ ఉండి 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛను కింద రూ.4వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని సచివాలయం సిబ్బంది చెబుతున్నట్లు సమాచారం.

అప్పుడు అర్హులు... ఇప్పుడు అనర్హులా?

2006లో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ.200 పింఛను తీసుకున్న వికలాంగులు అప్పుడు అర్హత ఉందని, ఇప్పుడు లేదని చెప్పడం అన్యాయమంటున్నారు. అప్పుడు., ఇప్పుడూ పరీక్షించింది వైద్యులే. కేవలం ప్రభుత్వం పింఛన్ల సొమ్ము పెంచిది కాబట్టి పింఛనర్ల సంఖ్యను తగ్గించుకొనేందుకు వైద్యులకు సూచనలు ఇచ్చి పింఛన్లలో కోత విదిస్తోందని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి.

పింఛన్లపై వికలాంగుల ఆందోళన

వీరఘట్టం: అర్హత గల వికలాంగుల పింఛన్ల తొలగించి వారిని ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదని పాలకొండ నియోజకవర్గ వైసిపి యువజన విభాగం అధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు అన్నారు. వికలాంగులందరికీ పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనకు వెనుకాడబోమని హెచ్చరించారు

పుట్టుక నుంచి వికలాంగురాలిని



నేను పుట్టుక నుండే వికలాంగురాలిని. మొదటి నుంచి నేను వికలాంగుల పెన్షన్ అందు కుంటు న్నాను. ఇప్పుడు ఇలా అర్ధాంతంగా పింఛను నిలిపివేసినట్లు నోటీసులు అందజేయడంతో నా బతుకు అగోమచారంగా ఉంది పెన్షన్ లేకపోతే నా జీవనాధారమే కష్టంగా ఉంటుంది.

తిమ్మక కాంతమ్మ
నాగర గ్రామం, మరిపల్లి పంచాయితీ.

పెన్షన్ నిలిపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు



జీవితాంతం శారీరక వికలాంగు రాలిగా జీవిస్తు న్నాను. అధికారులు 60 శాతం పైబడి వైకల్యం ఉందంటూ ధ్రువీకరణ పత్రం కూడా అందజేశాను. కానీ ప్రభుత్వం పింఛను నిలిపివేస్తున్నట్లు నోటీస్ ఇచ్చింది. ఇప్పుడు ఎంపిడిఒ ఆఫీస్‌కు వచ్చి ధ్రువీకరణ పత్రాలన్నీ అందజేశాను. పెన్షన్ రాకపోతే ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

ఆరిక కాడి,
పి. సంధి గూడా, మరిపల్లి పంచాయతీ

వికలాంగ శాతం తక్కువ ఉన్నవారికి నోటీసులు అందజేశాం

మండలంలో వికలాంగుల శాతం తక్కువ ఉన్న 96 మందికి నోటీసులు అందజేసి వారికి ధ్రువీకరణ పత్రాలతో ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి ఆన్లైన్ చేయించుకోవాలని చెపుతున్నాం. వారందరికీ కూడా సదరం చేయించుకోవడానికి ఉన్నతాధికారులు ఇచ్చిన తేదీకి ఆస్పత్రి చెప్పి పంపిస్తామని అప్పుడు వైద్యులు వారి వికలాంగుల శాతాన్ని ధ్రువీకరిస్తారు.

బి వై నాగభూషణరావు,
ఎంపిడిఒ కురుపాం



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

కలెక్టరేట్ వద్ద గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని, పాత పద్ధతిలో స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా జీతాలు డైరెక్ట్‌గా చెల్లించాలని శుక్రవారం గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్ల సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శోభికకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, గ్రీన్ అంబాసిడర్ల నాయకులు జలుమూరు గౌరి మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు జిల్లాలో సుమారు వెయ్యి మంది పనిచేస్తున్నారన్నారు. వీరికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్వచ్ఛభారత్ స్కీమ్‌లో ఎంపిక చేసి గ్రామాల పరిశుభ్రత కోసం నియమించారని, అప్పట్లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా నేరుగా జీతాలు చెల్లించేవారని, గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అప్పజెప్పడం వల్ల సర్పంచులు, కార్యదర్శులు సక్రమంగా జీతాలు చెల్లించలేదని తెలిపారు. 15, 18 నెలల జీతాలు పెండింగ్ ఉన్నాయని, కొన్ని పంచాయితీల్లో రూ.3వేలు ఇచ్చి పని చేయమని చెబుతున్నారన్నారు. వీరు గ్రామాల్లో రోడ్లు ఊడ్చడం, చెత్త సేకరించడం, దోమల మందు పిచికారీ చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు చేస్తున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా ప్రాణాలు తెగించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేశారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో చెత్త పేరుకుపోతున్న నేపథ్యంలో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్యం కోసం గ్రీన్ అంబాసిడర్లు పని అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కానీ గ్రీన్ అంబాసిడర్లకి ఇస్తున్న రూ.6వేలు వేతనం కూడా సక్రమంగా చెల్లించడం లేదని, అనారోగ్యాల బారిన పడుతున్న వీరి రక్షణకే ఎటువంటి రక్షణ పరికరాలు, భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 8 నెలలు పెండింగ్ జీతాలు చెల్లించి స్వచ్ఛంద కార్పొరేషన్ ద్వారా డైరెక్టర్ జీతాలు చెల్లించాలని, జిఒ 132 ప్రకారం రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్‌లు రూ.4 వేలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుకూలంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే 2 రక్షణ పరికరాలు, సేఫ్టీ జాకెట్లు, మాస్కులు, గ్లౌజులు, కొబ్బరి నూనె, సబ్బులు, బూట్లు ఇవ్వాలని, బళ్ల రిపేర్లు చేయించి, గుర్తింపు కార్డులు యూనిఫాం లు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని, ప్రతినెలా 5లోపు జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, బంకురు సూరిబాబు, జె.గౌరి, మరియమ్మ, పాండా, వెంకట రమణ, సూర్య, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా నాలుగో శనివారం జరగనున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఛాంబరు నుంచి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణ, అవార్డులపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి నెలా ఒక నినాదంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని, ఈనెల వర్షాకాలంలో పరిశుభ్రత అన్న నినాదంతో ముందుకెళ్లనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించాలని, కార్యక్రమ ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గృహం, పరిసరాలు, బహిరంగ ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగునీటి కాలువలను, మరుగుదొడ్లను పరిశుభ్రం చేయడం, చేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. భోజనానికి ముందు, తదుపరి చేతులను పరిశుభ్రం చేసుకోవడం, ఇళ్లు, ఖాళీ స్థలాల్లో ఎటువంటి చెత్త లేకుండా పరిశుభ్రతగా ఉండేలా చేయించడం, ఇంట్లో ఉన్నవారికి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున రోగాలకు తావులేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చేపట్టిన పనులకు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయాలని, నీటి పరీక్షలు జరిపి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని బాగా నిర్వహించిన వారికి జిల్లా, రాష్ట్రస్థాయిలో అవార్డులను ప్రకటించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వామ్యమైన ప్రతి విభాగానికి అవార్డులు ఉంటాయాని, ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు, సూచనలకు అనుగుణంగా అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆమె కోరారు. అవార్డులకు ఎంపికైన శాఖలకు, అధికారులకు అక్టోబర్ 2న బహుమతి ప్రధానం ఉంటుందని ఆమె వివరించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డిఇఒ బి.రాజకుమార్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, పరిశ్రమల శాఖాధికారులు, సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆది కర్మ యోగి కింద 165 గ్రామాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆది కర్మ యోగి కార్యక్రమాన్ని 165 గిరిజన గ్రామాల్లో చేపట్టనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆది కర్మ యోగి కార్యక్రమంపై శుక్రవారం సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది కర్మయోగి ఒక గొప్ప కార్యక్రమమన్నారు. సమాజ భాగస్వామ్యంతో గిరిజన గ్రామాల్లో సాధికారిత సాధించడం జరుగుతోందని చెప్పారు. జిల్లాలో 500కు పైగా జనాభా కలిగిన 165 గిరిజన గ్రామాలను ఎంపిక చేశామని, దాదాపు 83వేల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారని ఆయన అన్నారు. ఆది కర్మయోగులుగా ప్రభుత్వ అధికారులు, యువ నాయకులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు తదితరులు ఉన్నారని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయి కర్మ యోగిగా ఐటిడి ఎపిఒ ఎ.మురళీధర్ శిక్షణ పొందారని, జిల్లా స్థాయి ఆది కర్మయోగులుగా 7 గురు శిక్షణ పొందారని ఆయన చెప్పారు. జిల్లాలోని 12 మండలాల నుంచి 60 మంది బ్లాక్ స్థాయి కర్మ యోగులను మండలానికి 5 మంది చొప్పున ఎంపిక చేసినట్టు తెలిపారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం

నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి

ప్రజాశక- పార్వతీపురం టౌన్

నేరాల నిర్మూలనకు సాంకేతికత వినియోగం, అవగాహన కార్యక్రమాలపై సిబ్బంది దృష్టి సారించాలని, కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతీ ఒక్క సిబ్బంది అవగాహనా కలిగి వుండాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు పురోగతి, తదితర విషయాలపై సమీక్షించారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా సిసిటిఎన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు..ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్ పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి గస్తీ సమయంలో వాహన తనిఖీ చెయ్యాలన్నారు. వీటితోపాటు కొత్త నేరచట్టాల్లో పెట్టిన కేసులపై కోర్టులో త్వరితగతిన అభి యోగపత్రాలు సమర్పించాలన్నారు. ఎఫ్ఐఆర్ ప్రాధాన్యత వివరించారు. అనంతరం జిల్లా లో వివిధ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తు విశేష ప్రతిభ కనపరిచిన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎసీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. నేర సమీక్ష సమావేశంలో ఎఎస్పీ అంకిత సురాన.ఐపిఎస్,ఎఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బి సిఐ రంగనాధం ,డి.సి.ఆర్.బి. సిఐ ఆదాం, సోషల్ మీడియా,సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు, సిఐ అప్పారావు ,ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు, జిల్లా సిఐ లు ,ఎస్ఐలు, జిఆర్పి ఎస్సై, ఎక్సైజ్ సిఐ, ఐరాడ్ శ్రీధర్ లు పాల్గొన్నారు..




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి, పక్కన ఎఎస్‌పి సురానా

తాగునీరు సక్రమంగా వచ్చేలా చూడండి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువ లోని కూరాకుల వీధి, నాయి బ్రాహ్మణుల వీధి వాసులకు గత ఐదు నెలలుగా రక్షిత తాగునీరు సక్రమంగా అందక నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వరకు ఖాళీ బిందెలతో ర్యాలీగా వెళ్లారు. స్థానిక డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. అదే సందర్భంలో విధి నిర్వహణలో భాగంగా అక్కడికి వచ్చిన ఆర్డబ్ల్యుఎస్ డిఇ పిఎంకె రెడ్డికి సమస్యను మహిళలు ఏ కరువు పెట్టారు. వెంటనే స్పందించిన డిఇ అక్కడే ఉన్న స్థానిక ఎఇ జోగారావు, నాయుడుకు సమస్య పరిష్కరించాలని సూచించారు. దీంతో మహిళలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రెండు వీధులకు చెందిన మహిళలు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు సమస్యను వివరిస్తున్న మహిళలు

హక్కుల కోసం నిరంతర పోరాటం

యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న నిరంతర పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, హక్కులను సాధించుకోవచ్చునని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి తెలిపారు. శుక్రవారం సాలూరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలకు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ జీవోలు ఇవ్వలేదని, గ్రాడ్యుటీకి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు యూనియన్ కోరుతుందని అన్నారు. గత సమ్మె కాలంలో అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌లతో అంగన్వాడీలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏమీ పట్టకుండా ఒకదానిపై ఒకటి భారాలు మోపుతుందని విమర్శించారు. అందుకే యాప్‌లను వ్యతిరేకిస్తూ సిమ్‌లను ఆఫీసులకు అందించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భారాలను తగ్గించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ వర్కర్లను షరతుల్లేకుండా అందరికీ మెయిన్ వర్కర్లుగా చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న జరిగే అంగన్వాడీ జిల్లా మహాసభలో జిల్లాలోని అంగన్వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలను నిర్ణయిస్తామని, కావున అంగన్వాడీలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి శశికళ, సెక్టార్ నాయకులు పార్వతి, అరుణ కుమారి, జానకి, అరుణ, జ్యోతి, మాణిక్యం, ఉత్తరమ్మ, మరియమ్మ, సత్యవతి, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గం

14 మందితో నూతన ప్రాజెక్టు కమిటీ ఎన్నిక

సాలూరు ప్రాజెక్టు కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా గౌరీశ్వరి, శశికళతో పాటు మరో 12 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

పార్వతీపురం + జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యం మినహా ఇతర యాజమాన్య సంస్థల కింద పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్ఎం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 పురస్కారాలకు ప్రతిపాదనలు కోరుతున్నామని తెలిపారు

గుండె సంబంధిత సమస్యలకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పిల్లల్లో పుట్టుక, ఎదుగుదల లోపాలు సకాలంలో గుర్తించి, చికిత్స అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎం, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాంలో భాగంగా స్థానిక జిల్లా ఆసుపత్రి సమీపాన గల డిఇఐసి కేంద్రంలో పుట్టుక నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న బాలలకు సిహెచ్‌డి, గుండె సంబంధిత సమస్యలకు విశాఖపట్నం మెడికవర్ ఆసుపత్రి నుంచి పిల్లల కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు వైద్య బృందం వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని, గుండె సంబంధిత సమస్యలున్న పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. పరీక్షలకు అవసరమైన వారికి 2డి– ఇకో కూడా ఉచితంగా నిర్వహిస్తారన్నారు. అనువంశకంగా, జన్యుపరంగా, ఇతర కారణాలచే గాని పిల్లల్లో ఆరోగ్య సమస్యలు, పుట్టుక, ఎదుగుదల లోపాలు, వ్యాధులు సంభవించవచ్చని, వాటిని సకాలంలో గుర్తించి తగు చికిత్స అందించడంతో సమస్యను దాదాపుగా సరి చేయవచ్చని తెలిపారు. ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న అంగన్వాడీ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్‌లో ఆరోగ్య సమస్యలు, లోపాలు, వైకల్యాలు (4డి లు), వ్యాధులు పిల్లల్లో సత్వరమే గుర్తించి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆర్‌బిఎస్‌కె వాహనం ద్వారా డిఇఐసి కేంద్రానికి చేర్చాలన్నారు. సమావేశంలో డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్.భరత్ చంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా

పార్వతీపురం : ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా పెట్టినట్టు ప్రాంతీయ ఎన్ఫోర్స్మెంట్ అధికారి బర్ల ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు అత్యంత కీలకమైన యూరియా ఎరువును దాచిపెట్టడం (హోర్డింగ్), బ్లాక్ మార్కెటింగ్ నివారించేందుకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. యూరియాను దారి మళ్లించడం, అక్రమంగా నిల్వ చేయడం లేదా బ్లాక్ మార్కెటింగ్ చేయడం చట్టవిరుద్ధమే కాకుండా రైతులకు ఇబ్బందులు కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం నిల్వలు, పంపిణీ జరుగుతున్నాయా లేదా అన్న దాన్ని పరిశీలిస్తున్నామని ఆయన అన్నారు. అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించరాఉ. యూరియా అక్రమ నిల్వ లేదా దారి మళ్లింపు సంబంధిత సమాచారం ఉన్నవారు సమీప విజిలెన్స్ కార్యాలయానికి తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడ్డానికి, ఎరువుల సమయానుకూల లభ్యతకు అందరి సహకారం అవసరమని ఆయన అన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదంచేయండి

ప్రజాశక్తి - పాలకొండ

సెప్టెంబర్ 13,14 తేదీల్లో సిఐటియు 11వ జిల్లా మహాసభలు పాలకొండ పట్టణంలో జరుగుతాయని, వీటిని జయప్రద చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఈమేరకు సిఐటియు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి అన్ని వర్గాల కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వేలాదిమంది ఉద్యోగులు పాల్గొంటున్న నేపథ్యంలో అఖిల భారత, రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు, ప్రభుత్వ పథకాల సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలపై మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కావున ఈ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.ఉమాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, సిఐటియు పాలకొండ మండల కార్యదర్శి కాదా రాము, ఆశా, అంగన్వాడీ మండల నాయకులు బి.శారద, పి.విట్టమ్మ, జి.జెస్సి బాయ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మజ్జి వీర నాయుడు, డ్రైవ్ మిల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బి.మాధవ్ ,కార్మికులు ఉన్నారు.

ఆలయ పనులను పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక కోట దుర్గ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ పరిశీలించారు. ఆలయానికి వచ్చిన యాత్రికులకు సౌకర్యాలు కల్పించేలా చూడాలన్నారు. వీరితో పాటు ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ, డిటి సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఇఇగా రమాదేవి

ప్రజాశక్తి - సీతంపేట



స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.రమాదేవిని నియమించినట్లు ఐటిడిఎ వర్గాల ద్వారా తెలిసింది. ఇటీవల ఇఇ రమాదేవిని ఆకస్మికంగా బదిలీ చేయడంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు సీతంపేట ఇఇగా రమాదేవిని కొనసాగించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం ఉన్న ఇఇ కుమార్‌ను నెల్లూరు బదిలీ చేసినట్లు సమాచారం

ప్రతినెలా 15 వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

ప్రతి నెల 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో డీడీలు తీయాలన్నారు. సరుకుల నిల్వ వివరాలు పట్టిక కూడా ఉంచాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సిఎస్‌డిటి సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

స్వమిత్వ సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని తామర కండి పంచాయతీ పరిధిలో గల రేపటివలసలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను శుక్రవారం ఇఒపిఆర్‌డి కెకె వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉండే వివిధ రకాల ఇళ్లు, స్థలాల కొలతలపై ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక ఇంటి పొడవు, వెడల్పు బట్టి ఈ సర్వేలో నిర్ణయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని ములగ గ్రామాల ప్రాంతంలో గల బడిదేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అన్ని రకాల అనుమతులను రద్దు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కొండ మైనింగ్ చేయడం వల్ల పర్యావరణానికి, తాగునీరుకు ముప్పు పొంచి ఉందన్నారు. వ్యవసాయ పంట పొలాలు నాశనమవుతుందని వివరించారు. పాలకులు, అధికారులు మైనింగ్ యాజమాన్యానికి సహకరించడం వల్లే తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కుట్టు మిషన్ శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల కుట్టు మిషన్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 67మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 60 రోజుల వరకు శిక్షణ పొందుతున్నారని, మిగిలిన రోజుల్లో కూడా శిక్షణను వినియోగించుకోవాలన్నారు. బిసి కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

అంటిపేటలో ఉపాధి గ్రామసభ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేటలో శుక్రవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు ఎగిరెడ్డి భాస్కరనాయుడు, మాజీ జెడ్పిటిసి అంబటి కృష్ణంనాయుడు, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, బలరాం నాయుడు, విశ్వనాథం హాజరైనారు. ఈ సందర్భంగా భాస్కరనాయుడు మాట్లాడుతూ ఈ పథకాన్ని అందరూ ఉపయోగించుకొని జీవనోపాధిని మెరుగుపర్చు కావాలని తెలిపారు. చేసే పనులు గ్రామానికి చాలా ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఎస్ఆర్‌పి దాసు మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఇసి) టీం ద్వారా గ్రామంలో ఉండే ఉపాధి వేతనదారులకు ఉపాధి హామీ పథకంలోని హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. వేతన రేటు (రూ.307) ఉపాధిలో కల్పిస్తున్న 94 రకాల పనుల గురించి వివరించారు. పథకంలోని పనులను చాటి చెప్పేందుకు గ్రామమంతా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు చేసిన పనులు, ఇంకా భవిష్యత్‌లో చేయాల్సిన పనుల వివరాలను గ్రామ పటం వేసి మ్యాప్ ద్వారా ప్రజలకు వివరాలు వెల్లడించారు. గ్రామస్తులను సందేహాలను నివృత్తి చేశారు. ఇజిఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

వరి పంటకు సోకుతున్న తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని సూరంపేటలో శుక్రవార రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణానికి అనుకూలంగా అనేక తెగుళ్ల వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిలో అగ్గి తెగులు, కాండం తొలుచు పురుగు, ఆకుముడత తెగుళ్ల పట్ల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ తెగుళ్లు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తీసుకోవాల్సిన మందులను తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ బాలకృష్ణ, నాగేశ్వరశర్మ రైతులు పాల్గొన్నారు.



వరికి సోకే తెగళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

టిడబ్ల్యు ఇంజినీరింగ్ విభాగంలో

వేధిస్తున్న సిబ్బంది కొరత

ముందుకు సాగని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఐటిడిఎకు వెన్నుముకల నిలబడి అభివృద్ధి పనుల్లో భాగస్వాములై ముందుకు ఈ శాఖ నడిపిస్తుంది. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయం ఏడాదికి మౌలిక వసతుల కోసం కోట్లాది రూపాయలు గిరిజన అభివృద్ధి కోసం ఖర్చు చేస్తూ ముందుకు సాగుతుంది. అలాంటిది ఈ కార్యాలయంలో సిబ్బంది లేక అధికారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలను అధిగమించలేని పరిస్థితి నెలకొంది.

స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం పరిధిలో మూడు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో సీతంపేట, పాతపట్నం, మందస డివిజన్లతో పాటు ఐటిడిఎలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారుల పోస్టు చాలా ఖాళీగా ఉన్నాయి. దీంతో ముగ్గురు చేయాల్సిన అభివృద్ధి పనులను ఒకరే చేయాల్సి వస్తుంది. తలకు మించిన భారమవుతుంది. దీంతో అభివృద్ధి పనులు లక్ష్యాలు ముందుకు సాగడం కష్టమవుతుంది. సీతంపేట సబ్ డివిజన్లో డిఇ, ముగ్గురు ఎఇలు ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు ఎఇలు మాత్రమే ఉన్నారు. అందులో ఒక్కరికి డిఇ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. పాతపట్నం సబ్ డివిజన్లో ఒక డిఇ, మూడు ఎఇలు ఉండాల్సి ఉండగా, డిఇ పోస్ట్ ఖాళీగా ఉంది. ఒక్క ఎఇ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఒక్క ఎఇకి డిఇ పోస్ట్ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఆయన దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. మందస సబ్ డివిజన్లో మూడు ఎఇ పోస్టులకు కేవలం ఒక్కరే ఉన్నారు.



ఐటిడిఎలోని టిడబ్ల్యుఒ కార్యాలయం

సీతంపేట డివిజన్ కార్యాలయంలో అదనంగా రెండు ఎఇ పోస్టులకు ఉండాల్సి ఉండగా, అవి కూడా ఖాళీగానే ఉన్నాయి. సీతంపేట ఇంజినీరింగ్ కార్యాలయంలో మూడు డిఇ పోస్టులకు రెండు ఖాళీలు ఉండగా, 11ఎఇ పోస్టులకు ఆరు ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా మూడు సబ్ డివిజన్లకు ముగ్గురు డిఇలు ఉండాల్సి ఉన్నప్పటికీ ఇద్దరే ఉన్నారు. సీతంపేట ప్రధానంగా డివిజన్ కార్యాలయానికి ఎఇఇ నాగభూషణంకు డిఇగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పాటు సీనియర్ అసిస్టెంట్లు ఆరుగురికి రెండు ఖాళీలు ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్‌లో మూడు పోస్టులకు మూడు ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా టెక్నికల్ అసిస్టెంట్లు పోస్టులు కూడా ఖాళీలు ఉండడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఎనిమిది మంది ఆఫీసు సబర్డినేటర్లు (అటెండర్లు) ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు.

సీతంపేట ఐటిడిఎకు టక్కుమని గుర్తొచ్చేది గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయం. గిరిజన గ్రామాల్లో మౌలికవసతుల కల్పన, అభివృద్ధి పనులు ఈ శాఖ ద్వారా ఎక్కువగా నిర్వహిస్తారు, రోడ్లు, రక్షణ గోడలు, పర్యాటక పనులు, సిసి రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల అదనపు భవనాల నిర్మాణాలు, మరమ్మతులు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. ఏడాదికి కనీసం రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అలాంటిది ఒకవైపు బిల్లులు లేక మరోవైపు తగిన సిబ్బంది లేకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగక గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయం రోజురోజుకు నీరసించిపోతుంది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ఇంజినీరింగ్ సిబ్బందిని పూర్తిస్థాయిలో భర్తీ చేసి పూర్వపు వైభవం తీసుకురావాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

సిబ్బంది కొరత ఉంది

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ డివిజన్ కార్యాలయంతో పాటు సబ్ డివిజన్లో కూడా ఎఇలు, ఇతర సిబ్బంది కొరత ఉంది. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది.

**కె.నాగభూషణం, డిఇ, టిడబ్ల్యు
సీతంపేట ఐటిడిఎ**



ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

గారమ్మ కాలనీ సమస్యలు పట్టించుకోండి

నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కాలనీ వాసుల ఆందోళన

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణ పరిధిలో గల గారమ్మ కాలనీలో సమస్యలు పరిష్కరించాలంటూ ఆ కాలనీ వాసులు శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గారమ్మ కాలనీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఉంటున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేమితో అనాగరిక వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌళిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, కాలువలు నిర్మాణాల కోసం నగర పంచాయతీతో పాటు, స్థానిక నాయకులను మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించడం లేదన్నారు. తాగు నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. నగర పంచాయతీలో ఇంటి పన్నులు వేలల్లో వసూలు చేస్తున్నారని, సదుపాయాలు మాత్రం కల్పించలేకపోతున్నారని అన్నారు. వెంటనే దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. కమిషనర్ వచ్చి సమాధానం చెప్పే వరకూ కదిలేది లేదని స్పష్టం చేశారు. దీంతో కమిషనర్ రత్నరాజు మాట్లాడారు తానే స్వయంగా శనివారం వచ్చి పరిశీలిస్తానని, వెంటనే తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

పాలకొండ జిల్లా కోసం పోస్ట్ కార్డు ఉద్యమం

పాలకొండ : పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరుతూ జిల్లా సాధన సమితి ప్రతినిధి బృందం శుక్రవారం పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పోస్ట్ కార్డుపై నివేదిన తెలియజేస్తూ ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో సాధన సమితి ప్రతినిధి బృందం సభ్యులు చౌదరి నాయుడు, బుడిత అప్పలనాయుడు, వండాన కుర్మారావు తదితరులు ఉన్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నిర్దేశించిన సమయానికి పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు టీకా కార్యక్రమం, సర్వలెన్స్‌పై జిల్లా స్థాయి కార్యశాల (వర్క్ షాప్) శుక్రవారం స్థానిక ఎన్జీఒ హోంలో నిర్వహించారు. డబ్ల్యూహెచ్ఒ సర్వలెన్స్ అధికారి జాన్ జూడ్ జాషువా పవర్ ప్రజంటేషన్ ద్వారా ఇమ్యూనైజేషన్‌పై రీఓరియంటేషన్ కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ పోలియో, హెపటైటిస్, క్షయ, కోరింత దగ్గు, న్యూమోనియా, కంఠసర్పి, తట్టు, అతిసారం, డిఫ్తీరియా, ధనుర్వాతం మొదలగు ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫీవర్ రాష్, ఎఎఫ్పిలతో ఎవరినైనా గుర్తిస్తే వారి నుంచి నమూనాలు సేకరించి సెంట్రల్ ల్యాబ్‌కు పంపించాలన్నారు. జిల్లాలో శత శాతం టీకాలు పూర్తి చేయడమే లక్ష్యంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ వై.విజయమోహన్, ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నర్సిపురంలో వైద్య శిబిరం


వీరఘట్టం : మండలంలోని సంతనర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

జి.శివడకు బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - కురుపాం

జి.శివడకు ఆర్‌టిసి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గుమ్మ లక్ష్మీపురంలో గల తన క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వినతి పత్రం అందించిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత ఆర్టీసీ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే జి.శివడ గ్రామానికి బస్సు వేయాలని అధికారులను కోరారని తెలిపారు. చెప్పిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులు ఫోన్ చేసి మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. వినతిని అందజేసిన వారిలో గ్రామస్తులు వెంకయ్య, గోజార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు సమస్యపై అధికారులతో ఫోన్లో సంప్రదిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎమ్మెల్యేకు పిఎసిఎస్ అధ్యక్షుడు వినతి

కిచ్చాడ సచివాలయానికి వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్ట్ వేయాలని ఎమ్మెల్యేకు కురుపాం పిఎసిఎస్ అధ్యక్షులు డొల్లు కిషోర్ వినతిని అందజేశారు. గుమ్మలక్ష్మీపురంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వినతి అందించిన వెంటనే స్పందించి కలెక్టర్ ఫోన్ చేసి వెల్ఫేర్ అసిస్టెంట్ సచివాలయానికి వేసేలా చర్యలు చెపట్టడం సంతోషంగా ఉందని అన్నారు.

వికలాంగులకు పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం : గత కొన్నేళ్లుగా తాము పొందుతున్న వికలాంగు పింఛన్లు ప్రభుత్వం తొలగించిందని, వాటిని మళ్లీ పునరుద్ధరించి ఆదుకోవాలని పలువురు వికలాంగులు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి పత్రాలు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వికలాంగులు వచ్చి తమ గోడు ను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్లు తప్పక మంజూరు చేస్తోందని తెలిపారు. భూ సమస్యలు, తాగునీరు, రోడ్లు, రుణాలు మంజూరు చేయాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు. ప్రతి సమస్య తెలుసుకొని పరిష్కరించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పిఎంఆర్‌కెవివై ద్వారా రైతు శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులకు సాగు ఖర్చు తగ్గించి దిగబడులను పెంచడం కోసం ఆధునిక సాగు సాంకేతిక పద్ధతులను వివరించడం కోసం ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద పెద్ద కంచూరులో రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ గిరిజన రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులకు దూరంగా ఉన్నారని, సాగులో నూతన మెలకువలు నేర్చుకోవడం ద్వారా పోడు వ్యవసాయంలో కూడా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. దీనిలో భాగంగా కలుపు నివారణకు సైకిల్ లీడర్ పోడు పద్ధతి ఒక చక్కని పరిష్కారమని సూచించారు. అలాగే కోడిపంటలన్నీ పూర్తిగా వర్షాధారంగా పండిస్తారు కాబట్టి తక్కువ నీటిని వినియోగించుకుని వర్షాభావాన్ని తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే గంటెలు, చోడీ, అతి తక్కువ కాలంలో పూర్తయ్యే సామలు వంటి పంటలను పండించుకోవాలని సూచించారు. వరి పంటను నీళ్లు ఉన్నచోట మాత్రమే పండించాలన్నారు. అలాగే రాబోయే రబీ సీజన్లో ఉలవ విత్తనాలు చల్లుకోవాలని తెలిపారు. తెగుళ్ల నివారణకు వేప కషాయం బాగా పనిచేస్తుంది సూచించారు. శతాభి సర్పంచి రామయ్య మాట్లాడుతూ మినుములు, పెసల విత్తనాలను సబ్సిడీపై అందించాలని, అన్ని గిరిజన గ్రామాల్లో ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేస్తే గిరిజన రైతుల్లో కొంతవరకు మార్పు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ యశోదకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, రాజు, సంజీవి పాల్గొన్నారు.



ఎక్కువ దిగుబడులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

సేంద్రియ ఎరువులపై అవగాహన

"నీడ్" స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో పాచిపెంట మండలం నీలంవలసలో మహిళలకు, రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా "నీడ్" డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలి, సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలను వాడకం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని రైతులకు తెలిపారు. అనంతరం కిచెన్ గార్డెనింగ్, పెరటి తోటల పెంపకం గురించిన అవగాహన కల్పించి, స్థలాల్లో నాటుకునేందుకు ఉచితంగా విత్తనాలు బెండ, బీర, అనప, ముల్లంగి, చిక్కుడు మొదలైన విత్తనాలను రైతులకు ఉచితంగా "నీడ్" స్వచ్ఛంద సేవా సంస్థ అందించింది. కార్యక్రమంలో మహేష్, మోహన్, రామకష్ణ, వసంత పాల్గొన్నారు.

పెరటి తోటలతో ఆరోగ్యకరమైన ఆహారం

ప్రజాశక్తి - కురుపాం

పెరటి తోటలతోనే ఆరోగ్యకరమైన ఆహార భద్రతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని కెవికె సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ అన్నారు. శుక్రవారం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞానకేంద్రంలో గిరిజన రైతులకు పెరటితోటల పెంపకం ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పిల్లల్లో పోషక ఆహార సమస్యలు, దీనికి అవసరమైన పోషక విలువలు గల పెరటితోటల పెంపకంపై శిక్షణ అందించారు. అనంతరం 35 మంది గిరిజన రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ స్రవంతి, ఉమాజ్యోతి, అనంతవిహారి, అను తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను అందజేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

చెరువులో దూకేసిన వ్యక్తి

ఆచూకీ కోసం గాలింపు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

మండలంలోని ఎం.బూర్జవలస చెరువులో గుర్తు తెలియని వ్యక్తి దూకేశాడు. దీన్ని చూసిన మహిళా రైతు బి.సన్యాసమ్మ గ్రామ యువకులకు వెంటనే చెప్పారు. జి.అప్పలనాయుడు, నూకరాజు, సత్యనారాయణ, రమేష్ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రమేష్, ఎఎస్ఐ సన్యాసిరావు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని స్థానికులతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించక పోవడంతో పోలీసులు, అగ్నిమాపక అధికారులు వెనుదిరిగారు.

తోటపల్లి కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని సింగిరెడ్డివలస గ్రామానికి చెందిన జమ్మల శంకరరావు (50) తోటపల్లి కాలువలో పడి మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు తహశీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శంకరరావుకు భార్య అప్పమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నారాయణమూర్తి సినిమాలు సందేశాత్మకమైనవి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ప్రముఖ విప్లవ నటుడు అర్.నారాయణమూర్తి తీసిన సినిమాలన్నీ సందేశాత్మకమైనవని, తాను నమ్మిన సిద్ధాంతాలనే సినిమాల ద్వారా ప్రజలకు తెలియజేసే విలక్షణ నటుడు నారాయణమూర్తి అని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. ఆర్.నారాయణమూర్తి స్వీయ దర్శకత్వంలో నటించిన యూనివర్శిటీ పేపర్ లీక్ సినిమా నర్సిపురంలో గల టిబిఆర్ సినిమా థియేటర్లో విడుదలైన సందర్భంగా శుక్రవారం నాడు స్థానిక ఎమ్మెల్యే వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్.నారాయణమూర్తి సమాజానికి ఏదో ఒక మెసేజ్ ఇచ్చేందుకే వివిధ రకాల కోణాల్లో విభిన్నమైన కథలతో సినిమాలు తీస్తున్నారన్నారు. సినీరంగం ద్వారా తను నమ్మిన సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేస్తున్నారన్నారు. ఇటీవల ఆర్.నారాయణమూర్తి పార్వతీపురం వచ్చిన సందర్భంగా తనను కలిసి సినిమాకు సంబంధించిన అనేక విషయాలు చర్చించారని తెలిపారు. యూనివర్సిటీలో జరుగుతున్న దోపిడీలు, ప్రస్తుత సమాజంలో ఉన్న మన గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న భాష, సంస్కృతిని తెలియజేసేలా ఈ సూచించిందని అన్నారు. పార్టీకి అతీతంగా ఆయనపై ఉన్న అభిమానంతో ఈ సినిమాను వీక్షించానని, ప్రతి ఒక్కరూ ఈ సినిమాను ఆదరించాలని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కెజిబివి పాఠశాల సమీపాన ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.

అనుమతి లేని షాపులు సీజ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీలో గుణుపూర్ జంక్షన్లో కొత్తగా నిర్మించిన నాలుగు షాపులను రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి తహశీల్దార్ శేఖరం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం గుణుపూర్ జంక్షన్‌లో ఎల్విన్‌పేట పంచాయితీకి చెందిన గ్రామ కంఠం భూములను ఆక్రమించి అక్రమంగా పలు షాపుల నిర్మాణం చేసిన మేరకు ఆయా షాపులను ఎల్విన్‌పేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశాల మేరకు తమ సిబ్బందితో వెళ్లి సీజ్ చేశామని తెలిపారు. ఈ షాపులు నేతేట్టి ఈశ్వరరావు (చంటి)కి సంబంధించినవిగా తాము నిర్ధారించామని తెలిపారు. అయితే ఇదే షాపుల కోసం సంబంధించి గతంలో కూడా పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సిబ్బందికి పలుమార్లు నోటీసులు అందించారని తెలిపారు. అయినప్పటికీ ఈశ్వరరావు ఆయా షాపులను ఎవరి అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపట్టారని తెలిపారు. కాబట్టి ఎల్విన్‌పేట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు తాము ఆయా షాపులను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బి.శివరామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



షాపులను సీజ్ చేసి హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు